క్లుప్తంగా

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

మద్దిపాడు: క్షయ వ్యాధిని నిర్మూలిద్దామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఆనందమోహన్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2025వ సంవత్సరం నాటికి దేశాన్ని టీబీ రహితంగా మార్చడానికి టీబీ ముక్త్ పంచాయత్ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ వ్యాధి నిర్ధారణ అయిన పక్షంలో పీహెచ్‌సీ నుంచి ఉచితంగా వైద్యం, మందులు లభిస్తాయన్నారు. 6 నెలల పాటు చికిత్స ఉంటుందని, చికిత్స సమయంలో వ్యాధిగ్రస్తునికి నెలకు రూ.500 ఇస్తారని, నెలకు సరిపడా సరుకులు కూడా అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రజనీకుమారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మద్దిపాడు మండల ట్రీట్‌మెంట్ యూనిట్ సభ్యులు, మద్దిపాడు పీహెచ్‌సీ సిబ్బంది హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మతల్లికి పొంగళ్లు


ఊరేగింపుగా పొంగళ్లు తీసుకెళ్తున్న భక్తులు

చీమకుర్తి: అంకమ్మతల్లి వార్షికోత్సవం సందర్భంగా సంతనూతలపాడులోని రజకవాడలో భక్తులు బుధవారం పొంగళ్లు పెట్టి ఊరేగింపుగా అమ్మవారి వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. పూజారి ఉప్పుటూరి రామయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తపల్లి వెంకటసుబ్బయ్య, స్థానిక నాయకులు దుంపా ఇంద్రసేనారెడ్డి, సుబ్బారావు, పిచ్చియ్య పాల్గొన్నారు.

ఘనంగా జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం


బీ నిడమానూరులో బహుమతులు అందిస్తున్న సర్పంచ్ శ్రీను

నాగులుప్పలపాడు: జగనన్న ఆణిముత్యాల కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బీ నిడమానూరులో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన తలకోల అచ్యుత్, షేక్ ఫర్హాన, రెబ్బవరపు నవీన్‌కు గ్రామ సర్పంచ్ వడ్డిముక్కల శ్రీనివాసరావు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసపత్రాలు అందజేశారు. వైస్ ఎంపీపీ మల్లెల జాన్సన్, నందం పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరులో...

అల్లూరు (కొత్తపట్నం): స్థానిక జెడ్పీ హైస్కూల్లో బుధవారం జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ మిట్నసల శాంతారావు పాల్గొని పదో తరగతిలో 580 మార్కులు సాధించిన షేక్ మైమూన్‌ను అభినందించారు. జగనన్న ఆణిముత్యాల సర్టిఫికెట్, రూ.3 వేల నగదు అందజేశారు. 568 మార్కులతో రెండో స్థానంలో నిలిచిన మిట్నసల హేమీమాకు రూ.2 వేల నగదు, మూడో స్థానంలో నిలిచిన షేక్ రిషీక్‌కు రూ.1000 నగదు, సర్టిఫికెట్లు బహూకరించారు. సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, ఉపసర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, హెచ్ఎం సుబ్బారావు, స్కూల్ చైర్మన్ శత్రుఘ్న, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అల్లూరులో నగదు, సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీటీసీ శాంతారావు

బాలికతో యువకుడి అసభ్య ప్రవర్తన

- ప్రశ్నించిన తండ్రిపై దాడి

ఒంగోలు టౌన్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా ఇదేమని ప్రశ్నించిన ఆమె తండ్రిపై ఓ యువకుడు దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఒంగోలు నగర పరిధిలోని పేర్నమిట్ట మాదాసు బజారులో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఒంగోలు తాలూకా స్టేషన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న చెన్నంశెట్టి శ్రీనివాసరావు పేర్నమిట్ట మాదాసు బజారులో నివాసం ఉంటారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. మైనర్ అయిన శ్రీనివాసరావు కుమార్తె గ్రామంలోని రామాలయానికి వెళ్లి ప్రసాదం తీసుకొని వస్తుండగా ఇంటికి ఎదురుగా నివాసం ఉండే మాదాసు ప్రవీణ్ అసభ్యంగా ప్రవర్తించాడు. అతడి చేష్టలకు భయపడిన సదరు బాలిక పరుగెత్తుతూ వెళ్లి తన తల్లి భద్రమ్మకు జరిగిన విషయాన్ని తెలియజేసింది. ప్రవీణ్‌ను మందలించేందుకు వెళ్లిన భద్రమ్మతో ప్రవీణ్ వాదనకు దిగడమే కాకుండా ‘నీ కూతుర్ని చంపుతా’ అని బెదిరించాడు. ఈలోగా అక్కడకు చేరుకున్న శ్రీనివాసరావుపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి


ఒంగోలులో యోగా డేలో ఆసనాలు వేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మేయర్ గంగాడ సుజాత


బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో యోగా డే నిర్వహిస్తున్న ప్రతినిధులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి
- ఘనంగా యోగా దినోత్సవం

ఒంగోలు: యోగాను ప్రతిఒక్కరూ నిత్యజీవితంలో భాగంగా మార్చుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతంగా జీవించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక జిల్లా న్యాయసముదాయాల ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. యోగాలో ఉన్న వివిధ రకాలైన ప్రక్రియల ద్వారా సగటు మానవుడు ఎటువంటి అనారోగ్య సమస్యలకు గురికాకుండా ఉండవచ్చన్నారు. పతంజలి యోగ పీఠానికి సంబంధించిన గురువులు భాస్కర్, రవి, జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు ఎంఏ సోమశేఖర్, టి.రాజా వెంకటాద్రి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సత్యశ్రీనివాస్, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో...

స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించగా, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ విభాగం అధిపతి సీహెచ్ శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ డి.ధనుంజయరావు, జేకేసీ కో ఆర్డినేటర్ సురేష్, ఎన్ఎస్ఎస్ విభాగం అధిపతి వి.శ్రీలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్విస్ కాలేజీలో...

స్థానిక క్విస్ కాలేజీలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తుండటం భారతదేశానికి దక్కిన అరుదైన గౌరవమని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, క్విస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సూర్యకళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ కన్వీనర్ శెగ్గెం శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాయపాటి అజయ్‌కుమార్, శివాజీ యాదవ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సెంట్రల్ స్కూల్లో...

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సాయిబాబా సెంట్రల్ స్కూల్లో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగాసనాల ఆవశ్యకత గురించి పాఠశాల అకడమిక్ డైరెక్టర్ శ్రీసాయినాథుని శృతి వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. యోగాసనాలు వేయించారు. యోగా ప్రయోజనాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ జీవీ భాస్కర్, ప్రిన్సిపాల్ ఎం.మహేష్ పాల్గొన్నారు.


యోగా సాధన చేస్తున్న సాయిబాబా సెంట్రల్ స్కూల్ విద్యార్థులు

పేస్ కాలేజీలో...

స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో యోగా దినోత్సవాన్ని కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పతంజలి యోగా కేంద్రం గురువు డాక్టర్ ఆర్.ప్రసాదరావు, 34వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆఫీసర్ కల్నల్ అజయ్ కుటిన్హో పాల్గొని విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి పాల్గొన్నారు. డాక్టర్ ప్రసాదరావును ఘనంగా సత్కరించారు.

సర్వేరెడ్డిపాలెంలో...

ఒంగోలు రూరల్: మండలంలోని సర్వేరెడ్డిపాలెంలో నిర్వహించిన యోగా డేలో ఒంగోలు ఎంపీడీవో పి.అజిత పాల్గొని మాట్లాడారు. యోగా విశేషాలను ఒంగోలు ఈవోఆర్డీ రమణమ్మ వివరించారు. కార్యక్రమంలో సర్వేరెడ్డిపాలెం కార్యదర్శి రాంమోహన్‌రావు, ఎంపీడీవో కార్యాలయ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొని యోగాసనాలు వేశారు.

త్రోవగుంటలో...

త్రోవగుంటలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఎం చల్లా బ్రహ్మయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులచే యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ క్రీడాకారిణి, పాఠశాల పీడీ హాజీరాబేగం యోగాసనాల గురించి విద్యార్థులకు తెలియజేశారు.

సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కాలేజీలో...

చీమకుర్తి: సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కాలేజీలో డైరెక్టర్ ప్రొఫెసర్ బీ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. కాలేజీలోని ఇంజినీరింగ్ విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. యోగా నిపుణులు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో...

చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో యోగా దినోత్సవం సందర్భంగా 700 మంది విద్యార్థులతో వెల్లంపల్లి రంగారావు ఆధ్వర్యంలో యోగా విన్యాసాలు ప్రదర్శించారు. యోగా ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ బీ జవహర్, హెచ్ఎం, టీచర్లు, స్థానికులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో పాల్గొన్న డ్వామా పీడీ...

నాగులుప్పలపాడు: యోగాతో మానసిక బలం, అంతులేని ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత చేకూరుతుందని డ్వామా పీడీ శీనారెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం నాగులుప్పలపాడులో ఉపాధి కూలీలు, పాఠశాల విద్యార్థులతో యోగాసనాల వేయించారు. పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవనంలో బతుకులు యాంత్రికంగా మారిన పరిస్థితుల్లో మనస్సు, ఆరోగ్యం, ప్రశాంతత కోసం యోగా ప్రక్రియ చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈదుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. బీ నిడమానూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్‌సీసీ బెటాలియన్ విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఏపీవో రవికుమార్, టీఏ పిచ్చయ్య, కామిశెట్టి శంకరరావు, వెంకటప్పయ్య, కాకి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి


సర్వేరెడ్డిపాలెంలో యోగాసనాలు వేస్తున్న ఎంపీడీవో, తదితరులు


ఒంగోలులో డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కళ్యాణి


యోగా సాధన చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, తదితరులు


త్రోవగుంట హైస్కూల్లో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్న హెచ్ఎం బ్రహ్మయ్య


చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో యోగా విన్యాసాలు


నాగులుప్పలపాడులో విద్యార్థులతో యోగా చేయిస్తున్న డ్వామా పీడీ శీనారెడ్డి



డాక్టర్ ప్రసాదరావును సత్కరిస్తున్న పేస్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, తదితరులు

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు


నాగులుప్పలపాడు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆంధ్రప్రగతి బ్యాంకు సిబ్బంది


చీమకుర్తి: విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న బ్యాంక్ మేనేజర్ రాజు


మద్దిపాడులో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కెనరా బ్యాంక్ మేనేజర్ సాయి శ్రీనివాస్, ఎంఈఓలు

నాగులుప్పలపాడు: ఆలిండియా క్యూట్ ఫర్ స్కూల్ చిల్డ్రన్ ఆన్ ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. లీడ్ బ్యాంక్, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కిషోర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించేందుకు ఆర్‌బీఐ వారు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రథమ స్థానంలో మద్దిరాలపాడు పీవీసీ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, తృతీయ స్థానంలో పోతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలవగా, వారికి బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఈవీ రమణయ్య, అధ్యాపకులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి: ఫైనాన్షియల్ లిటరసీపై ఆర్‌బీఐ వారు చీమకుర్తి మండలంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో బండ్లమూడి జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. బుధవారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన ఈ పోటీల్లో గాడిపర్తివారిపాలెం, పల్లామల్లి జిల్లాపరిషత్ హైస్కూళ్ల విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో వరుసగా రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు బ్యాంక్ మేనేజర్ రాజు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ బొడ్డు ఏడుకొండలు, ఆయా పాఠశాలల టీచర్లు పాల్గొన్నారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఐ వారు బుధవారం నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతి సాధించారు. మద్దిపాడు కెనరా బ్యాంక్ మేనేజర్ సాయిశ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మొదటి బహుమతిని గుండ్లాపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బి.సాత్విక, బి.వైష్ణవి సాధించగా, రెండో బహుమతిని మద్దిపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సునీత, వెంకట దిలీప్‌కుమార్ సాధించారు. మూడో బహుమతిని పెదకొత్తపల్లి పాఠశాలకు చెందిన ఎం.చరణ్య, మమత సాధించారు. గెలుపొందిన వారికి వరుసగా రూ.5 వేలు రూ.4 వేలు, రూ.3 వేలను అందించనున్నట్లు మేనేజర్ సాయి శ్రీనివాస్ తెలిపారు. ఎంఈవోలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎంఆర్ దాణాతో పాల ఉత్పత్తి పెంచుకోవాలి

- అమూల్ మిల్క్ సెంటర్‌ను పరిశీలించిన డీఏహెచ్ఓ బేబీరాణి


దొడ్డవరం ఏఎంసీయూను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి డాక్టర్ బేబీరాణి

మద్దిపాడు: టీఎంఆర్ దాణా, పశుసంవర్ధకశాఖ ఇచ్చే జొన్నలను వినియోగించుకుని పాల దిగుబడి పెంచుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి డాక్టర్ బేబీరాణి సూచించారు. మండలంలోని దొడ్డవరం గ్రామంలో అమూల్ మిల్క్ కలెక్షన్ యూనిట్‌ను బుధవారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. పాల సేకరణ జరుగుతున్న విధానం, ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశుపోషకులకు అండగా నిలవడానికే జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆకస్మిక మరణాల ద్వారా పశు నష్టం జరిగినా పశుపోషకులు నష్టపోకుండా ఉండడానికి పశుబీమా పథకం ద్వారా దారిద్ర్య రేఖకు దిగువనున్న వారికి 80 శాతం, మధ్యతరగతి వారికి 50 శాతం సబ్సిడీతో ఇన్స్యూ కట్టిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఏఎంసీయూను పరిశుభ్రంగా ఉంచుతూ సక్రమంగా నిర్వహించాలని కార్యదర్శికి సూచించారు.

నీట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందనలు


అమృతను అభినందిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, అధికారులు, నాయకులు

మద్దిపాడు: మండలంలోని ఘడియపూడి పునరావాసకాలనీకి చెందిన బొమ్మల అమృత ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 559 మార్కులు సాధించి ఆంధ్రా యూనివర్సిటీలో మెడికల్ సీటు దక్కించుకోవడంతో ఆమెను ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం అభినందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అమృతకు శాలువా కప్పి బొకే ఇచ్చి సన్మానించారు. అమృత తండ్రి, ఘడియపూడి సర్పంచ్ రామాంజనేయులును అభినందించారు. అమృతను అభినందించిన వారిలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రజనీ, డీటీ జ్యోతి, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, పిట్టల ఆంజనేయులు, బొమ్మల దేవదాసు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

9వ డివిజన్‌లో వలంటీర్లకు వందనం


వలంటీర్‌ను సత్కరిస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: స్థానిక 9వ డివిజన్‌లో కార్పొరేటర్ వెన్నపూస శోభారాణి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి సేవా మిత్ర, సేవా వజ్ర అనే పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధులుగా వలంటీర్లు ఉంటూ నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేర్చడం గొప్ప విషయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మానవత్వంతో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా నగరాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా అందరికీ సహాయపడుతూ గొప్ప పేరు తెచ్చుకుంటున్నారన్నారు. అనంతరం వలంటీర్లకు అవార్డులు అందించడంతో పాటు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి వెన్నపూస వెంకటరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పూర్ణచంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సేవలు


మద్దిపాడులో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీవో, తహసీల్దార్

ఒంగోలు రూరల్: అర్హులందరికీ ప్రభుత్వ సేవలు అందాలని, అందుకోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఒంగోలు తహసీల్దార్ పి.మురళి తెలిపారు. బుధవారం మండలంలోని కరవది గ్రామ సచివాలయంలో సర్పంచ్ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష సర్వే గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.అజిత, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, కరవది సచివాలయం-1, 2, మండువవారిపాలెం, వలేటివారిపాలెం, చేజర్ల గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నాకు పలానా పని కాలేదని ఎవరూ అనకూడదు...

కొత్తపట్నం: ప్రజలెవరూ నాకు పలానా పని కాలేదు.. నా సమస్యను పరిష్కరించలేదు అని చెప్పకూడదని, ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కొత్తపట్నం తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో పి.సుజాత అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై బుధవారం రెండోరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్తపట్నం గ్రామ సచివాలయం 1, 2, కె.పల్లెపాలెం, రంగాయపాలెం, గమళ్లపాలెం, రాజుపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష గురించి వివరించారు. రంగాయపాలెం సర్పంచ్ గాలి స్వరూప, పాదర్తి సర్పంచ్ కట్టా సౌందర్య భర్త చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, వీఆర్వో వినోద్‌కుమార్, ఎంపీటీసీ ఉప్పుటూరి కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


కరవదిలో మాట్లాడుతున్న ఒంగోలు తహసీల్దార్ మురళి


కొత్తపట్నంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుజాత

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి సూచించారు. మద్దిపాడులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, జేసీఎస్ మండల కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, నాయకులు గుడ్డపాతల రవి, పిట్టల ఆంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు దాతలు బుధవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరం తరఫున 22 సైకిళ్లు పంపిణీ చేయగా, బొమ్మిరెడ్డి నరేంద్ర 6 సైకిళ్లు, కంది శేషారెడ్డి ఒకటి, యెనుముల రామిరెడ్డి ఒకటి చొప్పున అందించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగకల్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భావనారుషి ఆలయానికి రూ.2 లక్షల వెండి ఆభరణాలు


స్వామివారికి బహూకరించిన వెండి ఆభరణాలు

చీమకుర్తి: చీమకుర్తిలోని భద్రావతి సమేత భావనారుషిస్వామి ఆలయానికి స్థానిక దాతలు రూ.2 లక్షల విలువ చేసే వెండి ఆభరణాలు బహూకరించారు. సుబ్బరత్నం జ్ఞాపకార్థం ఆమె భర్త నారాయణం సుబ్బారావు, కుమారుడు వెంకట ప్రసాద్ అనూరాధ వెండి ఆభరణాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కొత్రపు రాఘవరావు, ఎస్.హరిప్రసాద్, మర్రి లక్ష్మీనారాయణ, వడిశా సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అభయాంజనేయస్వామి ఆరాధనోత్సవాలు

ఒంగోలు టౌన్: నగరంలోని కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయ క్షేత్ర పాలకుడైన అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధనోత్సవాలను ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఆలూరు వేంకటరమణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆయన కోరారు. పాల్గొనదలచిన భక్తులు శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.